ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్డీయే కూటమి నుంచి పలువురిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కడప జిల్లా నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. మంత్రివర్గంలో వీరెవరికీ చోటు దక్కలేదు. అయితే.. అనూహ్యంగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరికి మంత్రి వర్గంలో చోటు దక్కింది. రాయచోటి నుంచి టీడీపీ తరపున గెలిచిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి, ధర్మవరం నుంచి బీజేపీ తరపున గెలిచిన ప్రొద్దుటూరుకు చెందిన సత్యకుమార్‌కు మంత్రి వర్గంలో స్థానం దక్కింది. దీంతో కడప జిల్లా ఎమ్మెల్యేల్లో నైరాశ్యం నెలకొన్నా.. రెండు మంత్రి పదవులు రావడంతో ఉమ్మడి జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రివర్గంలో కడప జిల్లాకు మొండిచేయి

- అయినా.. ఉమ్మడి జిల్లాకు డబుల్ ధమాకా
- రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి..
- ప్రొద్దుటూరుకు చెందిన సత్యకుమార్ మంత్రి వర్గంలోకి..
- ఆశావహుల్లో నిర్వేదం.. జిల్లా వాసుల్లో హర్షం

(కడప/రాయచోటి-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా నుంచి కడప, కమలాపురం, ప్రొద్దుటూరు, మైదుకూరు, రాయచోటి స్థానాలను టీడీపీ గెలుచుకుంది. ఆర్.మాధవి, పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, ఎం.రాంప్రసాద్‌రెడ్డి మొదటిసారి ఎమ్మెల్యేలుగా గెలుపొందగా.. నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోసారి గెలిచి రికార్డు సృష్టించారు. ఇక జమ్మలమడుగుకు బీజేపీ నుంచి ఆదినారాయణరెడ్డి, రైల్వేకోడూరుకు జనసేన నుంచి ఎ.శ్రీధర్ గెలుపొందారు.

మంత్రివర్గంపై ఆశలు

మంత్రివర్గంపై కడప, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు ఎమ్మెల్యేలు ఆశ పెట్టుకున్నారు. మహిళా కోటాలో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డికి వస్తుందని ఆమె వర్గీయులు ఆశించారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలవడంతో ఆయనకు ఇస్తారనుకున్నారు. బీసీ కోటాలో పుట్టా సుధాకర్‌యాదవ్ ధీమాగా ఉన్నారు. మరోసారి మంత్రి పదవి బీజేపీ కోటాలో వస్తుందని ఆదినారాయణరెడ్డి భావించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి టీడీపీలో ఉత్సాహం తెచ్చిన రామగోపాల్‌రెడ్డి కూడా మంత్రి పదవి ఆశించారు. వివిధ రాజకీయ సమీకరణాల కారణంగా తొలివిడతలో వీరికి మంత్రివర్గంలో చోటు లభించలేదు.

ఉమ్మడి జిల్లాలో ఇద్దరు

మంత్రివర్గంలో ఉమ్మడి కడప జిల్లా నుంచి ఇద్దరికి చోటు లభించింది. రాయచోటి ఎమ్మెల్యే ఎం.రాంప్రసాద్‌రెడ్డికి తొలిసారిగా మంత్రిభాగ్యం దక్కింది. ఇక ధర్మవరం ఎమ్మెల్యేగా గెలిచిన ప్రొద్దుటూరుకు చెందిన సత్యకుమార్‌నూ మంత్రిపదవి వరించింది. దీంతో ఉమ్మడి జిల్లా నుంచి మనోళ్లకు ఇద్దరికి మంత్రిపదవులు దక్కినట్లయింది. మంత్రిపదవి అనే ది ఒక జిల్లాకు ప్రాంతానికి కాదు. రాష్ట్రానికి కావడంతో ఆయాశాఖల అభివృద్ధి పనుల్లో జిల్లాకు ప్రాధాన్యం ఉంటుందని జిల్లా వాసులు భావిస్తున్నారు.


మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి


పులివెందుల పూలంగళ్ల సర్కిల్‌లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

రాంప్రసాద్‌రెడ్డికి మంత్రియోగం..

మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి ఎమ్మెల్యేగా మొదటిసారి గెలిచారు. ఈయన కుటుంబం సుమారు నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉంది. రాంప్రసాద్ రెడ్డి తండ్రి మండిపల్లె నాగిరెడ్డి సమితి ప్రెసిడెంట్‌గా పనిచేశారు. గంట గుర్తుపైన గెలిచిన ఆయన తర్వాత గంటా నాగిరెడ్డిగా ఈ ప్రాంతంలో సుపరిచితుడు. మండిపల్లె నాగిరెడ్డి 1985, 1989లో రాయచోటి ఎమ్మెల్యేగా పనిచేశారు. 1992లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆయన వరుసకు సోదరుడు అయిన నారాయణరెడ్డి ఉప ఎన్నికలో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం 1994లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ నారాయణరెడ్డి విజయం సాధించారు. 2003లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన రాంప్రసాద్‌రెడ్డి 2009లో కాంగ్రెస్ పార్టీ తరపున టికెట్టును ఆశించారు. అప్పట్లో టికెట్టు రాలేదు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2014లో జై సమైక్యాంధ్ర పార్టీ తరపున పోటీ చేసి ఓటమి చెందారు. తర్వాత వైసీపీలో చేరారు. 2019 సాధారణ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి శ్రీకాంత్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేశారు. ఆ తర్వాత అధికార పార్టీలో ఇమడలేక వైసీపీ నుంచి బయటకు వచ్చి టీడీపీలో చేరారు. 2024 ఎన్నికల్లో టికెట్టు దక్కించుకున్నారు. ఈ ఎన్నికల్లో తొలిసారిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఇప్పటికే మూడు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన వైసీపీకి కంచుకోట లాంటి రాయచోటిలో టీడీపీ జెండా ఎగురవేసి రికార్డు సృష్టించారు. 1951లో రాయచోటి నియోజకవర్గం ఏర్పడింది. ఇప్పటి వరకు జరిగిన అనేక ఎన్నికల్లో 9 మంది ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. వీరిలో పలువురు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందారు. అయినా మంత్రియోగం దక్కలేదు. అయితే అనూహ్యంగా తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి చంద్రబాబు మంత్రివర్గంలో అవకాశం దక్కింది.

కలిసొచ్చిన దూకుడు స్వభావం

ఇప్పుడు అందరి నోటా వినిపించేది ఒకే మాట.. దూకుడు స్వభావం కలిగిన రాంప్రసాద్‌రెడ్డి ఎలా ఎమ్మెల్యేగా గెలిచాడు...? మంత్రి పదవి ఏ విధంగా వచ్చింది? దీనికి అతడి వర్గీయుల నుంచి సమాధానం ఒకటే.. దూకుడు స్వభావమే మా నాయకునికి కలిసొచ్చిందని.. ఇంకా అధికారం సుమారు రెండున్నర సంవత్సరాలు ఉండగానే అధికార పార్టీ నుంచి బయటకు వచ్చిన ఆయన మొదటి నుంచీ కొంచెం దూకుడుగానే వ్యవహరించారు. చిన్నమండెం మండలంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తపై ఓ కేసు విషయమై పోలీసుస్టేషన్‌ను కార్యకర్తలతో కలిసి ముట్టడించారు. ఈ సందర్భంగా ఆయనపై కేసు నమోదైంది. అటువంటి సంఘటనలే ఇంకా ఒకటి రెండు జరిగాయి. తర్వాత గత ఏడాది ఆగస్టులో అంగళ్లు, పుంగనూరులలో టీడీపీ అధినేత చంద్రబాబుపైన మంత్రి పెద్దిరెడ్డి అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా టీడీపీ, వైసీపీలు బాహాబాహికి దిగారు. ఈ గొడవల్లో రాంప్రసాద్‌రెడ్డి స్వయంగా పాల్గొన్నారు. దీంతో ఇతనిపైన హత్యాయత్నం కేసు నమోదైంది. ఇటువంటి సంఘటనల వల్ల చంద్రబాబు, నారా లోకేశ్ దృష్టిలో పడ్డారు. ఈ నేపథ్యంలో.. రాయచోటి ఎమ్మెల్యే టికెట్టును రాంప్రసాద్‌రెడ్డికి కేటాయించారు. మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి దక్కడం పట్ల రాయచోటి ప్రాంత ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రాంప్రసాద్‌రెడ్డి కార్యాలయం వద్ద పెద్ద ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి మంత్రి వర్గ ప్రమాణస్వీకారాన్ని తిలకించారు. వెనుకబడిన ప్రాంతమైన రాయచోటికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం దక్కడం.. ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని పలువురు ఆశిస్తున్నారు. అనూహ్యంగా రాంప్రసాద్‌రెడ్డికి మంత్రి పదవి దక్కడం జిల్లా రాజకీయాల్లో సంచలనం కలిగించింది.

ధర్మవరం నుంచి.. మంత్రిగా నిలిచి..

ప్రొద్దుటూరుకు చెందిన బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ ధర్మవరం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. వాస్తవానికి ఈయనది అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం గడేకల్లు గ్రామం. అయితే వీరు చాలాకాలం క్రితమే ప్రొద్దుటూరులో స్థిరపడ్డారు. తొలి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా గెలవడంతోపాటు టీడీపీ కూటమి ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కించుకున్నారు. విద్యార్థి దశనుంచే సత్యకుమార్ యాదవ్ రాజకీయాల పట్ల ఆసక్తి పెంచుకున్నారు. మదనపల్లిలో చదువుకుంటున్న సమయంలో ఏబీవీపీ తరపున కళాశాల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకటయ్యనాయుడు వద్ద కార్యదర్శిగా పనిచేశారు. ఆయన సేవలను గుర్తించిన బీజేపీ, 2018లో పార్టీ జాతీయ కార్యదర్శిగా నియమించింది. ప్రస్తుతం ఆయన బీజేపీ ఉత్తరప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల సహ ఇన్‌చార్జిగా, అండమాన్ నికోబార్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఆయన ఎన్నికల్లో పోటీ చేయడం ఇదే మొదటిసారి. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నుంచి ఈ సార్వత్రిక ఎన్నికల్లో అనూహ్యంగా బరిలో దిగి ఎమ్మెల్యేగా గెలవడంతోపాటు చంద్రబాబు మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. దీంతో ప్రొద్దుటూరు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సత్యకుమార్

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి వెళ్లి గుండెపోటుతో వ్యక్తి మృతి


మృతి చెందిన కావడి నరసింహులు

చెన్నూరు/వల్లూరు, జూన్ 12: చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి విజయవాడకు వెళ్లిన వల్లూరు మండలం వెంకటేశాపురం వాసి కావడి నరసింహులు (71) తీవ్ర ఉద్వేగానికి గురై గుండెపోటుతో మృతిచెందాడు. ఈయనకు తెలుగుదేశం పార్టీ అన్నా.. చంద్రబాబు అన్నా ఎనలేని అభిమానం. ఎన్నికల్లో వల్లూరు మండలం సహా స్వగ్రామంలో పుత్తా క్రిష్ణచైతన్య రెడ్డిని కమలాపురం ఎమ్మెల్యేగా గెలిపించేందుకు ప్రచారం చేశాడు. అలాంటి వ్యక్తి బుధవారం విజయవాడలో చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని కనులారా చూసి ఆనందించాలని మంగళవారం రాత్రి చెన్నూరు నుంచి మరికొందరితో కలసి బస్సులో బయల్దేరాడు. అప్పటికే తీవ్ర ఉద్వేగంతో ఉన్న ఆయన అర్ధరాత్రి దాటిన తరువాత చిన్నపాటి అస్వస్థతకు గురయ్యాడు. బుధవారం ఉదయం వెంట చెన్నూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకుల చలపతి, బీసీ సెల్ మండల కార్యదర్శి కుందేటి క్రిష్ణయ్య, ఆర్ఎంపీ వైద్యుడు పిచ్చయ్య, శివాలయాలపల్లె బీసీ నేత శ్రీనివాసులు ఆయనను విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి ఆటోలో తీసుకుపోయారు. ఆస్పత్రిలో చేర్చగానే ఒక్కమారుగా గుండె చేత్తో గట్టిగా పట్టుకుని మృతి చెందాడు.

పార్టీలో సీనియర్ కార్యకర్తగా ఉంటూ చెన్నూరు, వల్లూరు మండలాల్లో టీడీపీ కోసం తపించే ఆయన తమ కళ్లెదుటే చనిపోవడంతో వెంట ఉన్న టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆవేదనకు గురి అయ్యారు. మృతదేహాన్ని విజయవాడ నుంచి ప్రైవేటు అంబులెన్స్ ద్వారా వల్లూరు మండలం వెంకటేశాపురానికి తరలించారు. ఆరోగ్యంగా వెళ్లిన నరసింహులు చనిపోయి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు కన్నీంటి పర్యంతమయ్యారు. ఈ వ్యవహారాన్ని సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి పార్టీ ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని బాధిత కుటుంబానికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి భరోసా ఇచ్చారు.

ఓదార్పు కార్యక్రమంలా.. కౌన్సిల్ సమావేశం

- ఇంత అభివృద్ధి చేసినా మెజార్టీ తగ్గడం దారుణం
- ఇకపై రోజూ ప్రజా సమస్యలపై చర్చిద్దాం
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో చైర్మన్, వైస్ చైర్మన్

పులివెందుల రూరల్, జూన్ 12: మున్సిపాలిటీలో ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనులు ఎంత వరకు పూర్తయ్యాయి, పూర్తి అయ్యేందుకు ఏమైనా అడ్డంకులున్నాయా, నిధులు ఖర్చు, అంశాలపై సాగాల్సిన కౌన్సిల్ సాధారణ సమావేశం.. ఓదార్పు కార్యక్రమంలా సాగింది. బుధవారం పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టే పనులకు కౌన్సిల్ ఆమోదానికి ఓ అధికారి చదివి వినిపించారు. పులివెందుల మున్సిపాలిటీలో దాదాపు రూ.800కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టాము.. అయినా జగన్‌మోహన్‌రెడ్డికి మెజార్టీ తగ్గడం దారుణమంటూ పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ వైఎస్ మనోహర్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పులివెందులకు వందలకోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అంతేస్థాయిలో అమలు చేశామన్నారు. ఈసారి జగన్‌మోహన్‌రెడ్డికి లక్ష పైచిలుకు మెజార్టీ తెప్పించేందుకు కంకణం కట్టుకుని ఆ దిశగా అడుగులు వేశామని, అయినా 60వేల పైచిలుకు మాత్రమే ఓట్లు రావడం దారుణమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీకి ఘోర పరాజయం పొందడం బాధాకరమన్నారు. పనులు చేశాం బిల్లులు ఎప్పుడు వస్తాయంటూ పలువురు అడుగుతుంటే వారికి సమాధానం చెప్పలేనిపరిస్థితి దాపురించిందన్నారు. పాడా ద్వారా పనులు చేసినందున బిల్లులు అవుతాయా లేదా అనేది చెప్పలేకపోతున్నామన్నారు. రోజూ కార్యాలయానికి వచ్చి ప్రజల సమస్యపై చర్చిద్దామన్నారు. కలిసికట్టుగా పనిచేసి పులివెందుల అభివృద్ధి కోసం పాటుపడదామన్నారు.

సమస్యలపై చర్చ ఏదీ?

ఉదయం 11గంటలకు సమావేశం అని తెలియజేసి 11:37గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లు వచ్చారు. ఓ అధికారి 10నిమిషాలు అజెండాలోని పలు అంశాలను చదివారు. 12గంటలకు సమావేశాన్ని ముగించారు. ఈ సమయంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కేవలం ఓ ప్రైవేటు సమావేశంలా సాగిందనడంలో సందేహం లేదు. ఎందుకంటే కేవలం పులివెందులలో మెజార్టీ తగ్గడం, వైసీపీ ఘోరంగా ఓడిపోవడం, పాడా లేకుంటే అభివృద్ధి ప్రశ్నార్థకమైందని మాట్లాడడం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగించింది. ఏ వార్డులో ఏ పనులు చేయబోతున్నామో, అందుకు ఎంత ఖర్చుచేస్తున్నామో.. తాగునీరు, డ్రైనేజీ, లైట్లు, తాగునీటి ట్యాంకులు, పారిశుధ్యం, బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులు, రాబడిపై చర్చించబోయే ముందు అజెండా పత్రాలు ఇవ్వాల్సి ఉండగా సభ్యులకు ఇవ్వలేదు. దీనిని బట్టి చూస్తే మున్సిపల్ అభివృద్ధిలో కౌన్సిలర్ల పాత్ర ఏమీ లేదన్నది స్పష్టమైంది. వారి దృష్టి అంతా చేసిన పనులకు బిల్లులు వస్తాయా రావా అనే విషయాలపైనే ఉన్నట్లు స్పష్టమవుతోంది. మధ్యలో ఓ కౌన్సిలర్ నగరవనం వద్ద టీడీపీ వారు టపాసులు పేల్చుతున్నారంట అన్నారు. దీనిని బట్టిచూస్తే వారి ఏకాగ్రత దేనిపై ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉండగా సమావేశంలో ఒక్క కౌన్సిలర్ కూడా అజెండా అంశాలపై మాట్లాడలేదు. 33 మంది కౌన్సిలర్లు, ముగ్గురు కోఆప్షన్ మెంబర్లు ఉండగా పది మందికి పైగా సభ్యులు సమావేశానికి డుమ్మా కొట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, టౌన్‌ప్లానింగ్ అధికారి అజయ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళీధర్, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

ఆప్కాబ్ చైర్‌పర్సన్ రాజీనామా

- నేడు డీసీసీబీ చైర్‌పర్సన్ పదవికి కూడా...?

కడప(రూరల్) జూన్ 12: రాష్ట్రంలో చంద్రబాబునాయుడు సారథ్యంలో బుధవారం ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆప్కాబ్ చైర్‌పర్సన్ పదవికి మల్లెల ఝాన్సీరాణి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆప్కాబ్ కేంద్రకార్యాలయంలో బుధవారం రాజీనామా పత్రాన్ని అందజేశారు. కడప కేంద్రసహకార బ్యాంకు(డీసీసీబీ) చైర్‌పర్సన్ పదవికి సైతం గురువారం రాజీనామా చేయనున్నట్లు తెలిసింది.

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత డీసీసీబీ పాలకమండలికి ఎన్నికలు నిర్వహించకుండా త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసి డీసీసీబీ చైర్మన్‌గా తిరుపాల్ రెడ్డిని నియమించారు. తరువాత ఆయన స్థానంలో 2021 జూలై 31న మల్లెల ఝాన్సీరాణి డీసీసీబీ చైర్‌పర్సన్‌గా వచ్చారు. ఈ నేపథ్యంలో 2024 సాధారణ ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓటమిపాలైంది. ఈ పరిణామాల నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రభుత్వ, ప్రభుత్వేతర అనుబంధ సంస్థలకు కట్టబెట్టిన నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయాలని ఆదేశించారు. ఆదేశాలు వెలువడిన మరుసటి రోజు నుంచే ఇతర జిల్లాల్లోని సహకారశాఖ పరిధిలోని డీసీసీబీ చైర్మన్లు, ఆయా ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీల త్రిసభ్య పర్సన్ ఇన్‌చార్జి కమిటీ బాధ్యతలు చేపడుతున్న అధ్యక్షులు రాజీనామాలు చేశారు. అయితే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలోని కడప కేంద్ర సహకార బ్యాంకు చైర్‌పర్సన్‌గా ఉంటున్న మల్లెల ఝాన్సీరాణి మాత్రం తమ నామినేటెడ్ పదవులకు రాజీనామా చేయకుండా కొనసాగుతూ వచ్చారు. ఈ నేపథ్యంలో 'డీసీసీబీ చైర్‌పర్సన్ రాజీనామాలో మడతపేచీ' అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం కథనం వెలువడింది. దీనిపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్న నేపథ్యంలో బుధవారం మల్లెల ఝాన్సీరాణి ఆప్కాబ్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేశారు. డీసీసీబీ చైర్‌పర్సన్ పదవికి కూడా గురువారం రాజీనామా చేయనున్నారని సమాచారం.



బడిగంట మోగింది

- ఈ ఏడు కొత్తగా బడిమెట్లెక్కనున్న 30 వేల మంది
- 3.60 లక్షల మంది విద్యార్థులతో సందడి
- నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం


రూపు మారిన చిక్కీ

కడప(ఎడ్యుకేషన్), జూన్ 12: నూతన విద్యాసంవత్సరం గురువారం నుంచి మొదలు కానుంది. చదువులమ్మ పండుగ ఆరంభానికి పాఠశాలలు ముస్తాబయ్యాయి. పిల్లలను బడికి పంపేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. వేసవి సెలవుల్లో విహార యాత్రలను పూర్తి చేసుకుని అయ్యవార్లు బడులకు సమాయత్తమయ్యారు. ప్రైవేటులో 20 రోజుల కిందట నుంచే ఉపాధ్యాయులు ప్రచారం చేసి పిల్లలను వారి పాఠశాలలకు రప్పించుకున్నారు. బడి తలుపులు తెరవగానే ఉపాధ్యాయులు విద్యాబోధనకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో 2,798 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమికపాఠశాలలు 1896, ప్రాథమికోన్నత 316, ఉన్నత పాఠశాలలు 586 ఉన్నాయి. ప్రభుత్వ పరిధిలో 1,958, ఎయిడెడ్ 66 పాఠశాలలు ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో కలిపి మొత్తం 3,17,515 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ప్రభుత్వ పరిధి పాఠశాలల్లో 1,27,620 మంది, ఎయిడెడ్‌లో 7,776 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది 1వ తరగతితో తొలిసారిగా బడి మెట్లెక్కేవారు 30వేల మంది వరకు ఉన్నట్లు సమాచారం.

కొనుగోళ్లతో సందడి

కొత్త విద్యాసంవత్సరం పుస్తకాల సంచులు, పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలు, యూనిఫాం, షూస్ తదితర సరంజామా కొనుగోళ్లతో సందడి వాతావరణం నెలకొంది. ప్రైవేటు పాఠశాలల్లో అయితే ఈ పాటికే ప్రవేశాల ప్రక్రియ దాదాపు పూర్తయిందనే చెప్పాలి. బడికి పంపేందుకు సాధారణ, మధ్యతరగతి వర్గాల ఆర్థిక పరిస్థితిని జూన్ మాసం తలకిందులు చేసింది. ప్రైవేటు పాఠశాలల్లో రుసుముల నియంత్రణ అనే మాట కలగా మారింది. ఆర్థిక సమస్యలున్నా అప్పులు చేసి పిల్లలను బడులకు పంపుతున్నారు.


మండలాలకు తరలించే పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో అనురాధ

యథావిధిగా విద్యాకానుక

పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాకానుకను యథావిధిగా పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం మారడంతో విద్యాకానుకను ఏం చేస్తారనే సందిగ్ధం నెలకొన్నందున ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 13న బడులు తెరుచుకునే రోజు నుంచే పంపిణీ మొదలుపెట్టనుంది. 2024-25 విద్యాసంవత్సరంలో పంపిణీకి ఇప్పటికే కిట్లను సిద్ధం చేసింది. అయితే ఓ వైపు పంపిణీతో పాటు మరో వైపు విద్యాకానుకపై విచారణ కూడా చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది.

రూపుమారిన చిక్కీ

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే చిక్కీ కొత్త ప్రభుత్వంలో రూపుమారింది. గత ప్రభుత్వంలో చిక్కీపై అప్పటి ముఖ్యమంత్రి జగన్ ఫొటో ఉన్న విషయం తెలిసిందే. ప్రస్తుత ప్రభుత్వంలో ఎవరి ఫొటోలు లేకుండా కేవలం ప్రభుత్వానికి సంబంధించిన ఎంబ్లమ్‌తో చిక్కీని రూపొందించారు.

ప్రతి విద్యార్థికి కిట్లు పంపిణీ..

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి విద్యార్థి కిట్ అందించనున్నాం. పాఠశాల ప్రారంభం తేదీల్లోనే పంపిణీ చేసేటట్లు పాఠశాలలకు ఇప్పటికే కిట్లను చేర్చాము. అలాగే పాఠ్య పుస్తకాలను కూడా మండల కేంద్రాలకు తరలిస్తున్నాం.

- డీఈవో అనురాధ

మిన్నంటిన టీడీపీ నేతల సంబరాలు

కడపలో మహిళల టీవీ వీక్షణ ● పులివెందుల, పెండ్లిమర్రి, కమలాపురం మండలాల్లో హర్షాతిరేకాలు



కడపలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు

పులివెందుల టౌన్, జూన్ 12: ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా బుధవారం పులివెందులలో తెలుగుతమ్ముళ్ల సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని పూలంగళ్ల సర్కిల్, 23వ వార్డు, యర్రగుడిపల్లెలో కేకులు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని జై టీడీపీ, జైజై చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడు తూ రాష్ట్ర వ్యాప్తంగా భారీ మెజార్టీ స్థానాలు గెలవడం సంతోషకమన్నారు. రాష్ట్రప్రజలకు ఎవరిపై నమ్మకం ఉంచారో అర్థం చేసుకోవచ్చన్నారు. నాలుగోసారి ముఖ్య మంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం రాష్ట్ర ప్రజలు పండుగ చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వెంకటరామిరెడ్డి, జోగిరెడ్డి, గంగాధర్‌రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి, మహబూబ్ బాష, యర్రగుడిపల్లె మునెయ్య, చలపతి, షేక్ సమద్, కాంబల్లె గంగాధర్‌రెడ్డి, హుస్సేన్, జోష్ మహమ్మద్, షఫి, గౌస్, మాలిక్, జనసేన నాయకులు ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

27వ డివిజన్‌లో టీడీపీ సంబరాలు

కడప (నాగరాజుపేట), జూన్ 12: స్థానిక 27వ డివిజన్ పరిధిలో టీడీపీ ఇన్‌చార్జ్ అమానుల్లా, లయన్ పఠాన్ ఖాదర్‌బాష, చాంద్‌బాషా ఆధ్వర్యంలో ముఖ్యమంత్రిగా చంద్ర బాబు నాలుగోసారి ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి టీడీపీ జిల్లా అధ్యక్షు డు శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవికి శుభాకాంక్షలు తెలిపారు. చంద్రబాబు సీఎంగా నాలుగోసారి ప్రమాణం చేస్తున్న సందర్భంగా రాష్ట్రంలో పండుగ వాతావరణం నెలకొంది. బడుగు, బలహీన వర్గాల కోసం పేదల మనిషిగా పేరున్న చంద్రబాబు హయాంలో అందరికీ మంచి జరగాలని ఆశిస్తున్నట్లు పలువురు టీడీపీ నేతలు తెలిపారు. షేక్ హబీబుల్లా, షేక్‌వల్లి, ఆసిఫ్, 39వ డివిజన్ ఇన్‌ఛార్జ్ ఆరిఫ్‌బాషా, షంషీర్, అల్లాబకాష్ పాల్గొన్నారు.



చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని వీక్షిస్తున్న జిల్లా వాసులు

పెండ్లిమర్రి మండలంలో...

పెండ్లిమర్రి, జూన్ 12: కమలాపురం ఎమ్మెల్యేగా పుత్తా కృష్ణచైతన్యరెడ్డి గెలుపొందడం, రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టడంపై మండల టీడీపీ నేతలు సంబరాలు అంబరాన్నంటాయి. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేసి కేక్‌లు కట్ చేశారు. వెల్లటూరులో మండల మహిళా నాయకురాలు అంజలి మైన్స్ నాగమల్లారెడ్డి ఆధ్వర్యంలో కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రతి ఇంట్లో టీవీలను చూస్తూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. రాష్ట్రానికి మళ్లీ మంచి రోజులు వచ్చాయని, విద్య, ఉద్యోగ అవకాశాలు మెరుగవుతాయని రాష్ట్ర సంక్షేమ పథకాలు అభివృద్ధిలో దూసుకుపోతాయని పలువు రు టీడీపీ నేతలు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సాంబ శివారెడ్డి, వెంకటరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎర్రగుడిపాడులో...

కమలాపురం రూరల్, జూన్ 12: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా ఎర్రగుడిపాడులో టీడీపీ నేత రామక్రిష్టారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాలుగోసారి ప్రమాణం చేయడం రాష్ట్రానికే గర్వకారణమని టీడీపీ నేతలు అన్నారు. చంద్రబాబు పరిపాలనలో ప్రజలందరూ సుఖశాంతులతో ఉన్నారని రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు నిత్యంకృషి చేస్తున్నారన్నారు. బుధవారం ఉదయం టీటీడీ కళ్యాణ మండపంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం వీక్షించేందుకు భారీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. టీడీపీ కార్యకర్తలు కేరింతలు కొడుతూ ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.



వెల్లటూరులో కేక్ కట్ చేస్తున్న మైన్స్ నాగమల్లారెడ్డి, అంజలి


సీఎం ప్రమాణ స్వీకారాన్ని వీక్షించిన జిల్లా ప్రజలు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 12: సార్వత్రిక ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన టీడీపీ కూటమి రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కృష్ణాజిల్లా గన్నవరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు ప్రత్యక్షంగా వీక్షించేలా కడప నగరం నూర్జహాన్ కల్యాణ మండపంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమానికి అధికారులు, స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు మహిళా సంఘాలు పెద్దఎత్తున హాజరయ్యారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణం చేయడాన్ని లైవ్ ద్వారా వీక్షించిన పలువురు మహిళలు మాట్లాడుతూ గతంలో సీఎంగా చాలా అనుభవం ఉన్న ఆయన ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధిపథంలో నడవాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చక్రాయపేట, జూన్ 12: మండలంలో గురువారం మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ ఉండదని ఏఈఈ ప్రవీణ్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. చక్రాయపేట, మహదేవపల్లె, కె.రాజుపల్లె, కె.ఎర్రగుడి సబ్‌స్టేషన్ పరిధి గ్రామాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు. చక్రాయపేట సబ్‌స్టేషన్ నుంచి వెలువడే 33కెవి చక్రాయపేట ఫీడర్‌లో మరమ్మత్తుల కారణంగా ఈ అంతరాయం ఉంటుందని, సహకరించాలని వినియోదారులను బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

భగవాన్ రామగిరి బాబా ఆరాధన మహోత్సవాలు



కడప (కల్చరల్) జూన్ 12: భవానీనగర్ (అక్కాయపల్లె) బిల్టప్ సమీపంలో వెలసిన భగవాన్ రామగిరి బాబా ఆలయంలో గురుపూజ ఆరాధన మహోత్సవాలు వైభవంగా జరగనున్నట్లు రామగిరి బాబా సేవా సమితి ఛైర్మన్ రాజభాస్కర్ రావ్ షిండే పేర్కొన్నారు. 15వ తేదీ శనివారం నుంచి 19వ తేదీ వరకు కార్యక్రమాలు జరగనున్నట్లు తెలిపారు. బుధవారం విలేఖరుతో మాట్లాడుతూ రోజూ ఉదయం 7 గంటలకు, సాయంత్రం 7-30 గంటలకు స్వామివారికి అభిషేకం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం ఉంటా యన్నారు. బుధవారం ఉదయం 6 గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం, గణపతి హోమం, రుద్రహో మం, నవగ్రహ హోమం, పూర్ణాహుతి, కార్యక్రమాలుంటాయన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

పాఠశాలల వద్దకే విద్యార్థికి కిట్ : డీఈఓ

కడప (ఎడ్యుకేషన్), జూన్ 12: ప్రభుత్వపాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికీ కిట్ అందిస్తున్నట్లు డీఈఓ ఎం.అనురాధ తెలిపారు. బుధవారం కడప నగరం ఎంఈఓ కార్యాలయం నుంచి విద్యార్థుల కిట్ల వాహనానికి జెండా ఊపి ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ ఎంఈఓ లంతా ప్రణాళికలు వేసుకుని పనులు పూర్తి చేయాలన్నారు. ఎమ్మార్సీ సిబ్బందితో కలిసి పాఠశాల స్థాయికి కిట్లను పంపిణీ చేయాలన్నారు. ప్రతి విద్యార్థికీ కిట్‌లోని అన్ని వస్తువులు వచ్చేలా చూడాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే సీఎంఓ సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీలు, ఎంఐఎస్ కంప్యూటరు ఆపరేటర్లు ఎంఈఓలు నారాయణ, ఇర్షాద్ అహ్మద్ పాల్గొన్నారు.



వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఈఓ

జ్ఞానపీఠ పురస్కారానికి వన్నె తెచ్చిన కవి సి.నా.రే

ప్రొఫెసరు రాంప్రసాద్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జూన్ 12: తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేసి 1988లో విశ్వంభర కావ్యరచనకు జ్ఞానపీఠ పురస్కారం పొంది పురస్కారానికే వన్నెతెచ్చిన కవి సి.నారాయణరెడ్డి అని సీపీబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ప్రొఫెసరు రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం వైవీయూ ఆధ్వర్యంలో సీకే సంపత్‌కుమార్ పఠనమందిరంలో వర్ధంతి సందర్భంగా నారాయణరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నారాయణరెడ్డి చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో సీపీ బ్రౌన్ జూనియర్ అసిస్టెంటు ఆర్.వెంకటరమణ, సిబ్బంది నీలకంఠేశ్వర్, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



నారాయణరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లిన తెలుగు తమ్ముళ్లు

వేంపల్లె, జూన్ 12: నాలుగోసారి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి వేంపల్లె తెలుగు తమ్ముళ్లు తరలివెళ్లారు. పట్టణం సహా మండలంలోని వివిధ గ్రామాల నుంచి ముఖ్యనేతలు వాహనాల్లో మంగళవారం రాత్రి బయలుదేరి వెళ్లారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇతరనాయకులు చేసిన ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. కాగా వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీలో విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

జనసేన ఆధ్వర్యంలో...

జనసేన యువనేత రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక సంఘం వీధిలో బుధవారం సాయంత్రం కేక్‌కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. మంత్రిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రమాణం చేసే సందర్భంగా సంబరాలు చేసుకున్నారు. ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి హరీష్, బీజేపీ నాయకురాలు సుష్మ, మండల నాయకులుసునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త మంత్రులకు అభినందనలు

మంత్రులు కె.అచ్చెన్నాయుడు, ఎన్ఎండీ ఫరూక్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సత్యకుమార్, కొల్లు రవీంద్రను కలిసి అభినందించిన నేతలు, అభిమానులు

క్రిష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరిపల్లెలో టీడీపీ ప్రభుత్వం ప్రమాణ స్వీకార మహోత్సవం వేడుకగా జరిగింది. వేడుకకు హాజరైన టీడీపీ నేతలు, అభిమానుల, కార్యక ర్తలు మంత్రులను అభినందనలతో ముంచెత్తారు. వివరాల్లోకెళితే...

మంత్రి రాంప్రసాద్‌ను కలిసిన హరిప్రసాద్



రాంప్రసాద్‌ను సత్కరిస్తున్న హరిప్రసాద్ , ప్రతాప్‌కుమార్ తదితరులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 12: మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మండిపల్లె రాంప్రసాద్‌ను విజయవాడలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మర్యాద పూర్వకంగా కలిశారు. రాంప్రసాద్‌కు పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిటికేబుల్ ఎండీ రాగిమాను ప్రతాప్‌కుమార్, లకిడి విజయభాస్కర్, మైదుకూరు జనసేన నేతలు లక్ష్మీభరత్, నరసింగ, వెంకట సునీల్‌కుమార్, తుమ్మలకుంట ఈశ్వరయ్య పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌ను అభినందించిన కందుల మురళి



సత్యకుమార్‌ను సత్కరిస్తున్న కందుల మురళీమోహన్ రెడ్డి

కడప (మారుతీనగర్) జూన్ 12: ధర్మవరం అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా విజయం సాధించి రాష్ట్ర నూతన మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్న వై.సత్యకుమార్‌ను బీజేపీ రాష్ట్ర నేత కందుల మురళీమోహన్‌రెడ్డి అభినందించారు. బుధవారం క్రిష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి వద్ద ఆయనను కడప బీజేపీ రాష్ట్ర నేత కందుల రాజమోహన్‌రెడ్డి కుమారుడు బీజేపీ రాష్ట్ర నేత కందుల మురళీమోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దేశంలోనే అగ్రగామిగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు దోహదపడాలని ఆకాంక్షించారు.

సత్యకు మంత్రి పదవి రావడంపై బీజేపీ హర్షం

పెండ్లిమర్రి,జూన్ 12: ధర్మవరం ఎమ్మెల్యేగా గెలుపొందిన సత్యకుమార్ యాదవ్‌కు మంత్రి పదవి రావడంపై మండల బీజేపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గ మాజీ కన్వీనర్ బాలగురవయ్య యాదవ్ మాట్లాడుతూ పార్టీని నమ్ముకుని కష్టపడిన వారికి గుర్తింపు ఉంటుందనే దానికి నిదర్శనం సత్యకు మంత్రి పదవి రావడమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు రమణారెడ్డి, రామలక్ష్మణ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొల్లు రవీంద్రను సన్మానించిన యాటగిరి



మంత్రి కొల్లు రవీంద్రను సన్మానించిన యాటగిరి తదితరులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 12: మంత్రిగా ప్రమాణం చేసిన కొల్లురవీంద్రను బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనరు రాంప్రసాద్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మీడియా కోఆర్డినేటరు జనార్ధన్, బెస్త సాధికార కమిటీ జిల్లా సభ్యులు సాయి, రాము, వడ్డెర సాధికార కమిటీ బత్తల వెంకట్ పాల్గొన్నారు

మంత్రులను కలిసిన అమీర్‌బాబు



మంత్రి ఫరూక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అమీర్‌బాబు

కడప (ఎడ్యుకేషన్), జూన్ 12: మంత్రిగా ప్రమాణం చేసిన అనంతరం మంత్రులు కె.అచ్చెన్నాయుడు, ఎన్ఎండీ ఫరూక్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వీఎస్ అమీర్ బాబు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నాసర్ అలీ, మేకల వెంకటేశ్‌యాదవ్, నూర్‌బాషా, పలువురు టీడీపీ నేతలు, అభిమానులు పాల్గొన్నారు.

పత్తిపంట పరిశీలన

వేముల,జూన్ 12: దుగ్గన్నగారిపల్లెలో సాగులో ఉన్న పత్తిపంట పొలాలను కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త శశికళ, ఆత్మ డీపీడీ పద్మలత, ఎఫ్‌టీసీ ఏఓ శివశైలజ, వేముల ఏఓ చెన్నారెడ్డితో కలిసి బుధవారం పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తిపంటలో నీరు నిలవడంతో అక్కడక్కడా వేరుకుళ్లు తెగులు ఆశించిందన్నారు. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ (సీఓసీ) లీటరు నీటికి మూడు గ్రాములు కలిపి మొదలు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. మెగ్నీషియం సల్ఫేట్ లీటర్ నీటికి రెండు గ్రాములు, 13-0-45 మందును లీటరు నీటికి పది గ్రాములు కలిపి వర్షం నీరు నిలిచిన తర్వాత పిచికారీ చేయాలని తెలిపారు. గులాబి రంగు పురుగు ముందు జాగ్రత్త చర్యగా పత్తిపంటలో ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు అమర్చాలన్నారు. కార్యక్రమంలో రైతులు రామలింగారెడ్డి, పుల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

వేంపల్లె, జూన్ 12: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముద్దనూరు వ్యవసాయ సహాయ సంచాలకులు వి.వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. బుధవారం వేంపల్లె వ్యవసాయాధికారి రాజేంద్రప్రసాద్‌తో కలిసి విత్తన దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. అనంతరం ఆయా దుకాణాల్లో విత్తనాలు, ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్, ప్రిన్సిపుల్ సర్టిఫికెట్లు, స్టాకుబోర్డులు పరిశీలించారు. రైతులకు నకిలీ విత్తనాలను అమ్మరాదని, కొనుగోళ్లపై విధిగా రసీదు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జేసీఐపీ నగర అధ్యక్షుడిగా గున్నా జయరాం

కడప (మారుతీనగర్) జూన్ 12: జాతీయ చేతివృత్తుల ఐక్య వేదిక పార్టీ నగర అధ్యక్షుడిగా గున్నా జయరాం నియమితులయ్యారు. బుధవారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున నియామక ఉత్తర్వులను జయరాంకు అందజేశారు. నగరంలో పార్టీ మరింత బలోపేతం చేసేందుకు వీలుగా గ్రామ, వార్డు, మండల, కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. తద్వారా నగర ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి ఆయా సమస్యల పరిష్కారానికి చొరవచూపాలన్నారు. కాగా తన పట్ల విశ్వాసంతో అప్పగించిన బాధ్యతలను త్రికరణశుద్ధిగా సేవలందిస్తానని ఆయన వెల్లడించారు.

విద్యార్థులతో చెలగాటమాడుతున్న బీజేపీ సర్కారు

కడప (సెవెన్‌రోడ్స్), జూన్ 12: నీట్ ప్రశ్నాపత్రాన్ని లీక్ చేసి వైద్యవిద్యార్థులతో బీజేపీ సర్కారు చెలగాటమాడుతోందని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు యాదవ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్లబాబు, పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర విమర్శించారు. కడప ఆర్టీసీ బస్టాండులో అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టిన వారు మాట్లాడుతూ నీట్ యూజీ 2024 ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా ఫస్ట్‌ర్యాంకు వచ్చాయన్నారు. ఇందులో ఏడుగురు హర్యానాకు చెందిన ఒకే ఎగ్జామ్ సెంటరు వారు కావడం, వారికి 720/720 మార్కులు రావడం వెనుక బీజేపీ పెద్దల హస్తం ఉందని, దీంతో అర్హులకు నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా అధ్యక్షుడు పప్పుశెట్టి రెడ్డిసాయి, నాయకులు నవీన్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని నిరసన

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 12: రాయలసీమ వ్యాప్తంగా గుర్తింపు లేని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి యువజన సంఘాలు డిమాండ్ చేశారు. బుధవారం ఇంటర్మీడియేట్ ఆర్‌జేడీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనరు ఓబులేసు, పీఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జయరాజ్, ఆర్‌హెచ్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ఆర్‌వీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయుడు మాట్లాడుతూ రాయలసీమ జిల్లాల్లో కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు మినీ కార్పొరేట్ కళాశాల యాజమాన్యాలు అనుమతులు లేకుండా రెసిడెన్షియల్ కాలేజీలను ఏర్పాటు చేసి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దోచుకుంటున్నారన్నారు. దీనిపై విచారణ జరిపి వాటిని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్‌జేడీ కార్యాలయం ఏఓకు వినతిపత్రం అందించారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

కడప (ఎడ్యుకేషన్), జూన్ 12: జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటరు ఆకుల సుధారాణి తన భర్త దివంగత బొక్కసం వెంకటరమణ జ్ఞాపకార్థం టీటీడీ ముద్రించిన ఆంధ్ర మహాభారతం 18 పర్వాలను సీపీ బ్రౌన్ పరిశోధన కేంద్రం సంచాకులు ప్రొఫెసరు రాంప్రసాద్‌రెడ్డికి అందించారు. ఆయన మాట్లాడుతూ సుధారాణి బహూకరించిన 18 పర్వాల పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఆకుల కిశోర్‌బాబు, బొక్కసం మహతి, ఎం.నాగరాజు, సీపీ బ్రౌన్ సహాయ పరిశోధకులు శివారెడ్డి, గోపాలక్రిష్ణ, సహాయకులు పాల్గొన్నారు.


సభా వేదిక వద్ద కోలాహలం



వేదిక ముందు నందమూరి, నారా కుటుంబ సభ్యులతో హీరో రామ్‌చరణ్

చంద్రబాబు అనే నేను..

ప్రభంజనమై మేమూ..

కేసరపల్లిలో ఘనంగా టీడీపీ కూటమి మహా పట్టాభిషేకం

ప్రజాతీర్పునకు పట్టాభిషేకమైంది. జనం ప్రభంజనమై పండుగలా కదిలింది. అభిమాన కోలాహలం నడుమ కేసరపల్లి జయకేతనమై ఎగరగా, గన్నవరం జనవరమై జేజేలు పలికింది. 'నారా చంద్రబాబు నాయుడు అను నేను..' అనే మాటతో అభిమాన సంబరాలు అంబరాన్నంటాయి. కేసరపల్లిలో బుధవారం ఉదయం జరిగిన టీడీపీ కూటమి ప్రమాణస్వీకార మహోత్సవానికి అతిరథ మహారథులు హాజరయ్యారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

బస్సెక్కిన అభిమానం





చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తుండగా నందమూరి రామకృష్ణ భావోద్వేగం, బాలకృష్ణ, భువనేశ్వరి అనురాగం, సభావేదిక వద్ద నాగలితో ఓ రైతు ప్రదర్శన


వేదికపై బాలకృష్ణ, రజనీకాంత్ దంపతులు, చిరంజీవి


జనసేన, టీడీపీ, బీజేపీ స్టిక్కరింగ్ స్కూటర్లపై వినూత్నంగా..

40 మామిడిచెట్లు నరికివేత


మారెళ్లమడకలో నరికివేతకు గురైన మామిడిచెట్లు

చక్రాయపేట, జూన్ 12: మండలంలోని మారెళ్లమడక గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు 40 మామిడిచెట్లను నరికివేశారు. 20రోజుల క్రితం యోగాంజులరెడ్డి, వాసు దేవరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డిలకు సంబంధించిన 120 మామిచెట్లను దుండగులు నరికి వేశారు. ఆ ఘటన మరువక ముందే మంగళవారం రాత్రి వాసుదేవ రెడ్డికి చెందిన 40 మామిచెట్లను నరికివేశారు. మారెళ్లమడక గ్రామంలో మామిడి చెట్లను నరికేసిన ఘటనలో అప్పట్లో సీఐ గోవిందరెడ్డి, ఎస్‌ఐ రంగనాథ్‌లు పూర్తి స్థాయిలో విచారణ జరిపారు. డాగ్‌స్క్వాడ్ ప్రవేశపెట్టినా ఫలితం లేదు. మళ్లీ ఇపుడు 40 చెట్లను నరకడం పలు అనుమానాలకు దారితీస్తోంది. ఎవరు చేస్తు న్నారో.. ఎందుకు చేస్తున్నారో తెలియకపోవడంతో రైతులు తలలు బాదుకుంటున్నారు. గ్రామంలో కక్షలు, కార్పణ్యాలు లేక పోయినా మామిడిచెట్లు నరికేస్తున్నారని కొందరు... మరికొందరు గ్రామంలో కోల్డ్‌వార్ జరుగుతున్నట్లు చెబుతున్నారు. ఏది ఏమైనా ఇలా చేతికి అందివచ్చే మామిడిచెట్లను నరికివేయడాన్ని బాధిత రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి దుండగులను గుర్తించాలని కోరుతున్నారు. కాగా, కోతకు వచ్చిన మామిడిచెట్లు నరికివేతకు గురవడంతో దాదాపు రూ.10లక్షలు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్రోలు బంకు సమీపంలో చెలరేగిన మంటలు

● టియర్ గ్యాస్‌తో మంటలు ఆర్పివేసిన సిబ్బంది



బద్వేలు రూరల్, జూన్ 12: పట్టణంలోని నెల్లూరురోడ్డులో ఉన్న హెచ్‌పీ పెట్రోలు బంకు సమీపంలో బుధవారం మంటలు చెలరేగిన ఘటన స్థానికులను భయాందోళనకు గురి చేసింది. అప్రమత్తమైన సిబ్బంది టియర్‌గ్యాస్‌తో మంటలు ఆర్పివేయడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. వివరాలిలా.. వర్షాకాలం కావడంతో హెచ్‌పీ పెట్రోలు బంకులో పెట్రోలు నిల్వ ఉండే ట్యాంకరు చుట్టూ నీరు చేరడంతో నీటిని బయటికి తోడే క్రమంలో కాస్త పెట్రోలు నీటిలో కలిసినట్లు సమాచారం. తోడేసిన నీళ్లు సమీపంలోని టీ షాపు వద్ద వరకు ప్రవహించాయి. టీషాపు వద్ద ఎవరో సిగరెట్ తాగి పీకను పడివేయడంతో ఉన్న ట్లుండి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన పెట్రోలు బంకు సిబ్బంది హుటాహుటిన టియర్‌గ్యాస్ ఉపయోగించి మంటలు ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదమే తప్పినట్లయింది.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

చెన్నూరు, జూన్ 12: స్థానిక గోదినవారివీధి వాసి సాదు మహేశ్ (27) ఆదివారం తన ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. కాగా బుధవారం వరకు ఎవరూ గుర్తించలేకపోయారు. మహేశ్ తల్లిదండ్రుల్లో 15ఏళ్ల కిందట తండ్రి మృతి చెందగా, అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తూ తల్లి రెండేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో తల్లిదండ్రుల పట్ల ఎనలేని ప్రేమ ఉన్న మహేశ్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. కాగా అతనికి సోదరుడు మణికంఠ ఇటీవల బతుకుదెరువురీత్యా మారిషస్‌కు వెళ్లాడు. దీంతో ఒంటరితనంతో ఎక్కువగా ఆలోచించిన మహేశ్ ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందాడు. అయితే బుధవారం స్నేహితులు, బంధువులు కొందరు అతని ఇంటి వద్దకు వెళ్లగా లోపల గడియపెట్టి ఉండడం, కిటికీ వద్ద దుర్వాసన రావడంతో తలుపులు పగలగొట్టి చూడగా శవమై కనిపించాడు. ఈ సమాచారం పోలీసులకు అందించారు. వారు 108 వాహనం ద్వారా మృతదేహాన్ని స్థానిక పెన్నానదిలోకి తీసుకెళ్లి అక్కడే శవ పరీక్షలు పూర్తి చేసి ఖననం చేశారు. కాగా మృతుడు మెడికల్ రెప్‌గా పనిచేసే వాడని బంధువులు, స్నేహితులు తెలిపారు.

బాలలతో పనులు చేయిస్తే చర్యలు తప్పవు

కడప రూరల్, జూన్ 12: బాలలతో పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా చేపట్టిన పలు కార్యక్రమాలను ఆయన మీడియాకు తెలియజేశారు. కడప నగరంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, ఆయాశాఖల అధికారుల చేత న్యాయ విజ్ఞాన సదస్సులను నిర్వహించారన్నారు. బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం ప్రాముఖ్యతను వివరించి పోస్టర్లను ఆవిష్కరించామన్నారు. జాతీయ న్యాయసేవాధికార సంస్థ చేపట్టిన బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయసేవల పథకం 2015 గురించి, ఉచిత ప్రాథమిక నిర్బంద విద్యను తెలియజేశామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను తప్పక చదివించి ప్రయోజకులను చేయాలన్నారు.

నగరంలో అవగాహన : ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్వర్యంలో బుధవారం కడప నగరంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. మాసాపేటలోని కమల్ ఆటోగ్యారేజ్, పెట్రోల్ బంకులు, షాపులు, తులసి కాంప్లెక్స్ ఆర్కే. ఆటోవర్క్‌షాపు తదితర ప్రాంతాల్లో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, జిల్లా శిశుసంక్షేమశాఖ అధికారులు, పారాలీగల్ వలంటీర్లు సంయుక్తంగా న్యాయవిజ్ఞాన సదస్సులను ఏర్పాటు చేసి నిర్బంధ కార్మికుల రక్షణ, పునరావాస కార్యక్రమాలు గురించి తెలియపరిచారు.



కడప నగరంలో డీఎల్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, న్యాయవాదులు

20, 21న అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

కడప (మారుతీనగర్) జూన్ 12: తమిళనాడు రాష్ట్రం లోని అరుణాచలగిరి ప్రదక్షణకు వీలుగా తిరువణ్ణా మలైకి ఆర్టీసీ కడప రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి ఈనెల 20, 21 తేదీలలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ కడప రీజనల్ మేనేజర్ పి.గోపాల్ రెడ్డి తెలిపారు. ఆ మేరకు కడప డిపో నుంచి ఈనెల 20న సూపర్ లగ్జరీ బస్సు రాత్రి 8 గంటలకు బయలుదేరి రాయచోటి, చిత్తూరు, వేలూరు మీదుగా అరుణాచలానికి చేరుతుంది. ఇందులో టికెట్ ధర రూ.1072గా నిర్ధారించారు. బద్వేల్ డిపో నుంచి అల్ట్రాడీలక్స్ బస్సు ఉదయం 7 గంటలకు బయలుదేరి వయా గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా అరుణాచలానికి వెళుతుంది. ఇందులో టికెట్ ధర రూ.1566. దీంతో పాటు మరో సూపర్‌లగ్జరీ బస్సు ఉదయం 7గంటలకు బయలుదేరి పెంచలకోన, శ్రీకాళహస్తి, గోల్డెన్ టెంపుల్, కాణిపాకం మీదుగా చేరుకుంటుంది. టికెట్ ధర రూ.1475, మైదుకూరు డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు ఉదయం 9 గంటలకు బయలుదేరి కడప నుంచి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా వెళుతుంది. టికెట్ ధర రూ.1130లుగా నిర్ణయించారు. ప్రొద్దుటూరు డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు ఉదయం 7 గంటలకు బయలుదేరి వయా మైదుకూరు, కడప మీదుగా చేరుకుంటుంది. టికెట్ ధర రూ.1273, పులివెందుల డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు ఉదయం 7గంటలకు బయలుదేరి పీలేరు, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలానికి వెళుతుంది. టికెట్ ధర రూ.1242, జమ్మలమడుగు డిపో నుంచి ఈ నెల 20న సూపర్ లగ్జరీ బస్సు సాయంత్రం 5గంటలకు బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా అరుణా చలం చేరుతుంది. ఇందులో టికెట్ ధర రూ.1352 నిర్ణయించినట్లు తెలిపారు. ఇదిలా వుండగా ఇదే డిపో నుంచి ఈ నెల 21న సూపర్ లగ్జరీ బస్సు ఉదయం 5-30కి బయలుదేరి ప్రొద్దుటూరు, మైదుకూరు, కడప మీదుగా అరుణాచలం చేరుకోనుంది. ఇందులో టికెట్ ధరగా రూ.1352గా నిర్ధారించారు. ఈఅవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎం కోరారు.

దాల్మియా పరిసర ప్రాంతాల్లో లోకాయుక్త బృందం పర్యటన


వివరాలు సేకరిస్తున్న లోకాయుక్త అధికారులు

మైలవరం, జూన్ 12: మండల పరిధిలోని దాల్మియా పరిశ్రమ ప్రాంతాలైన నవాబుపేట, దుగనపల్లి గ్రామాల్లో లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ డిప్యూటీ డైరెక్టర్ పి.వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం బుధవారం పర్యటించింది. దాల్మియా పరిశ్ర మలో బ్లాస్టింగ్ చేయడం వలన సమీప గ్రామాలైన నవాబుపేట, దుగనపల్లి గ్రామాల్లోని ఇళ్లలో నెర్రెలు చీలి ఇళ్లు దెబ్బ తింటున్నాయని.. పంట పొలాలు కూడా దుమ్ము ధూళి పడి దిగుబడి కూడా పూర్తిగా తగ్గిపోయిందని లోకాయుక్తకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు లోకాయుక్త అధికారుల బృందం జమ్మలమడుగు ఆర్డీవో, రెవెన్యూ, ఇరిగేషన్, పొల్యూషన్, మైన్స్ అధికారులతో కలిసి గ్రామాల్లో పర్యటించింది. దాల్మియా పరిశ్రమలోని మైన్స్, నవాబుపేట, దుగనపల్లి గ్రామాల్లో పర్యటించి ప్రజలతో పరిశ్రమ వల్ల కలిగే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామాల్లో బ్లాస్టింగ్ వల్ల దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు.

28 నుంచి వైవీయూ పీజీ పరీక్షలు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 12: వైవీయూ ఎంఏ, ఎంకామ్ ఎంఎస్‌సీ, ఎంపీఈడీ, పీజీ డిగ్రీ 2, 4 సెమిస్టరు పరీక్షలు ఈ నెల 28 నుంచి నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఎస్.ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. రెండో సెమిస్టరు పరీక్షలు 28న, జూలై 1,3,5,8,10 తేదీల్లో ఉంటాయన్నారు. నాలుగో సెమిస్టరు పరీక్షలు 29, జూలై 2, 4, 6, 9, 11 తేదీల్లో జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

బండిసంజయ్‌ని కలిసిన సురేశ్‌నాయుడు

ప్రొద్దుటూరు, జూన్ 12 : నూతన కూటమి ప్రభుత్వం కొలువుతీరే కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండిసంజయ్‌ని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సురేష్ నాయుడు కలిశారు. బుధవారం విజయవాడలో జరిగిన కూటమి ప్రభుత్వంలో చంద్రబాబుతో పాటు బీజేపీ, జనసేన మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చిన ప్రధాని నరేంద్రతో పాటు కేంద్ర మంత్రులు హాజరయ్యారు. వీరిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను సురేష్ నాయుడును కలిసి రాజకీయ విషయాలు మాట్లాడారు.

మంత్రులకు శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు



రాంప్రసాద్‌ను సన్మానిస్తున్న హరిప్రసాద్, రాగిమాను ప్రతాప్‌కుమార్

బద్వేలుటౌన్, జూన్ 12 :చంద్రబాబు బుధవారం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతోపాటు పలువురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. వారిలో మండిపల్లె రాంప్రసాద్, మైనారిటీ మంత్రి ఫరూఖ్, కన్నా లక్ష్మీనారాయణ తదితరులకు టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహణకార్యదర్శి బాలిశెట్టి హరి ప్రసాద్, సీటీకేబుల్ ఛైర్మన్ రాగిమాను ప్రతాప్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీభరత్, విజయ్‌భరత్, నరసింగ్, ఈశ్వరయ్య, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు...



ప్రొద్దుటూరు టౌన్, జూన్ 12: రాష్ట్ర మంత్రిగా ప్రమాణం చేసిన సత్యకుమార్‌యాదవ్‌కు బీజేపీ జిల్లా మీడియా ప్యానలిస్టు నరేష్‌కుమార్‌యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం విజయవాడలో సత్యకుమార్ నివాసంలో మంత్రి పదవి వచ్చిన సందర్భంగా స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నరేష్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ సత్యకుమార్ మంత్రి కావడం సంతోషమని జిల్లాతోపాటు ప్రొద్దుటూరు అభివృద్ధికి ఆయన కృషి చేస్తారని పేర్కొన్నారు.

సత్యకుమార్‌కు మంత్రి పదవి రావడం హర్షణీయం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 12: ప్రొద్దుటూరుకు చెందిన సత్యకుమార్‌యాదవ్ రాష్ట్ర మంత్రిగా ఎంపిక కావడం హర్షణీయమని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. ఆయన కిందిస్థాయి నుంచి ఎంతో కష్టపడి మంత్రిస్థాయికి ఎదిగారని ఆయన ధర్మవరం నియోజకవర్గంతోపాటు ఆయన ప్రొద్దుటూరు ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

కూటమి నేతల సంబరాలు

ప్రొద్దుటూరు,జూన్ 12 : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమాన్నితిలకించడానికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో లైవ్‌స్ర్కీన్‌లతో ప్రజలు తిలకించేలా ఏర్పాటు చేశారు. బుధవారం ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయంలోని సభా భవనంలో చంద్రబాబుతో పాటు మంత్రి వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఆర్‌డీవో శ్రీనివాసులు, తహసీల్దారు విద్యాసాగర్, మున్సిపల్ కమిషనర్ రఘునాధరెడ్డి ఏర్పాటు చేసి తిలకించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది. ఐసీడీఎస్ మెప్మా సిబ్బంది సైతం పాల్గొన్నారు. కాగా టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం విజయవాడలో అంగరంగ వైభవంగా కొలువు తీరింది.ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో టీడీపీ యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.కేక్ కట్‌చేసి కార్యకర్తలకు అభిమానులకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దుగ్గిరెడ్డి రఘునాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన సంబరాలు..: కూటమి కొలువు తీరడంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయ డంపై జనసేన సంబరాలు జరుపుకుంది. బుధవారం శివాల యం సర్కిల్లో జనసేన నేత జిలాన్ ఆధ్వర్యంలో సంబరాలు జరుకున్నారు.

పోరుమామిళ్ల..: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండలంలోని చల్లగిరిగెలలో టీడీపీ నాయకులు కొండా రామక్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో సీతాలమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎ.శ్రీనివాసరెడ్డి, కే.శ్రీనివాసులరెడ్డితో పాటుటీడీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే పోరుమామిళ్లలోని గాంధీ విగ్రహం వద్ద టీడీపీ నేతలు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కనుమర్లపూటి రామసుబ్బారావు, సీతా వెంకటసుబ్బయ్య, ఇమాం హుసేన్, తెలుగుయువత అధ్యక్షుడు సీతా బాలాజీ, సెట్టింప్రతాప్, ఎస్ఎంబాషా, దరిశి బాలాజీ, షరీఫ్, రాజా, మస్తాన్, రంతుల్లా, కరీముల్లా, దర్మేష్ తదితరులు పాల్గొన్నారు. కమ్మవారిపల్లెకు చెందిన ఎంపీటీసీ కల్వకూరి రమణ, కల్వకూరి రమేశ్‌తో పాటు టీడీపీ నాయకులు ప్రమాణ స్వీకారానికి వెళ్లారు.

ఎర్రగుంట్ల..: చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఎర్రగుంట్లలో బుధవారం టీడీపీ, బీజేపి, జన సేనకు చెందిన ఎన్డీయే కూటమి కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ కార్యాల యం వద్ద బాణాసంచా పేల్చి ర్యాలీగా బయలు దేరారు. డప్పులతో నాలుగు రోడ్ల కూడలికి చేరుకున్నారు. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, టెంకాయ కొట్టి నివాళులు అర్పించారు. అనంతరం బాణసంచా పేల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణశాఖ టీడీపీ అధ్యక్షుడు సంజీవరెడ్డి, రమేష్‌నాయుడు, జంగంరెడ్డి, మల్లు గోపాల్‌రెడ్డి, చాంద్‌బాషా,రమేష్‌రెడ్డి, రాజారెడ్డి, కొండారెడ్డి, జగదీష్‌రెడ్డి, ఎర్రిస్వామి, హరిఓబుళ రెడ్డి, వాసుదేవరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శివారెడ్డి, మదూరుబాష, నరసింహారెడ్డి, అంకాల్‌రెడ్డి, భాస్కర్, వెంకటేష్, మస్తాన్, బ్రహ్మం, విజయశేఖర్, రాజు, రామాంజనేయులు, రామ్మోహన్, బాలు, వెంకటసుబ్బయ్య, సత్యంస్వామి పాల్గొన్నారు.



అట్లూరులో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న నాయకులు



ప్రొద్దుటూరులో అనాథ పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎర్రగుంట్లనగరపంచాయతీ కార్యాలయంలో అధికారులుఉదయం 10.30 నుంచి ఈ ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. చంద్రబాబుతోపాటు, ఇతర మంత్రులు ప్రమాణ స్వీకారాన్ని వీక్షించారు.

కొండాపురం..: సీఎంగా చంద్రబాబు ప్రమాణం చేయడంతో మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో టీడీపీ నేతలు ఆ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలోనేతలు బుగ్గన్నగారి చంద్రశేఖర్‌రెడ్డి,వేళ్ల గోవర్ధన్‌రెడ్డి, నాగశంకర్‌రెడ్డి,నరసింహాచారి,చైతన్యరెడ్డి,విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

ముద్దనూరు..: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మండల నేతలు సంబరాలు చేసుకున్నారు.టీడీపీ నాయకుడు కుదుముల శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాత బస్టాండు కూడలిలో 25కేజీల కేక్ కట్ చేసి సంబరాలు చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు బైకుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జి చింతాశివరామిరెడ్డి, టౌన్ ఇన్‌చార్జి రంగారెడ్డి, లక్ష్మీనారాయణ, శేఖర్‌నాయుడు,ప్రసాద్‌రెడ్డి, మాబు,బాబురెడ్డి,రామాంజనేయరెడ్డి, బాబాఅమీర్, పవన్‌కుమార్, రఘునాథరెడ్డి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలుటౌన్..: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో టీడీపీ సంబరాలు అంబరాన్నంటాయి. టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, బిగ్ బాస్, వడ్లపూడి నాగభూషణం ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్‌చేసి, బాణాసంచాపేల్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీవీఎస్ ప్రసాద్, నరసింహానాయుడు, జహంగీర్‌బాషా,రామక్రిష్ణ, రాంభూపాల్‌రెడ్డి, సత్తార్,వెంకటయ్యయాదవ్, ఝాన్సీరాణి, జీవీ సుబ్బారెడ్డి, మిత్తికాయల రమణ, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు..: చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మండలంలో ఎంపీపీ ఇన్‌ఛార్జ్ రెడ్డయ్య ఆధ్వర్యంలో అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద 100 కిలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో అట్లూరు ఎంపీపీ రమాదేవి, మండల టీడీపీ యువ నాయకుడు జయక్రిష్ణారెడ్డి, కొల్లు వెంకట సుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నరసింహులు, క్రిష్ణయ్య, అయ్యవారయ్య, ఇనుకేశవలక్ష్మి, నరసారెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశినాయన..: నారా చంద్రబాబు ప్రమాణస్వీకార కార్యక్రమానికి టీడీపీ నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. మండలానికి చెందిన కడప జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి,జిల్లా టీడీపీ కార్యదర్శి మురళీ యాదవ్, విజయ్‌కుమార్‌రెడ్డి,పంగా రవీంద్రారెడ్డి, బి.చెన్నక్రిష్ణారెడ్డి,నర్శిరెడ్డి, రోహిత్‌రెడ్డి,అక్కి రమణా రెడ్డి,పి.పోలిరెడ్డి, బుసిరెడ్డి వెంకట్రామిరెడ్డి నాయకులు కార్యకర్తలు వాహనాల్లో వెళ్లారు.

మైదుకూరు..: చంద్రబాబు ప్రమాణ స్వీకారంపై బుధవారం అధికారులు మైదుకూరులో ప్రత్యేక ఎల్‌ఈడీల ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేసి తిలకించారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో మండల తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీ డీవో ఫజుల్‌రెహ్మాన్, మున్సిపల్ కమిషనరు జబ్బార్‌మియా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వెలుగు, మెప్మా, అంగన్‌వాడీ సిబ్బంది,మహిళలు తిలకించారు.

మైలవరం..: మండల పరిధిలోని వేపరాల గ్రామంలో ఎంపీటీసీ కుమార్ ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాములేటి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా నందమూరి యువ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థి అనాథ శరణాలయంలో చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. బుధవారం బాణసంచా పేల్చి అనాథ శరణాలయంలో బాలబాలికలకు మిఠాయిలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి యువ సేవా సమితి ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, గౌరవాధ్యక్షుడు డాక్టర్ వీరాంజనేయులు, మల్లికార్జున, సుబ్బరాజు, మచ్చా నాగభూషణం, సమర, క్రిష్ణ చైతన్యరెడ్డి, ఆంజనేయులు, దస్తగిరి, సుబ్బయ్య, అనాథ శరణాలయం నిర్వాహకుడు విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: నారా చంద్రబాబుప్రమాణ స్వీకారం సందర్భంగా ఐదురోడ్ల కూడలిలో బి.మఠం టీడీపీ మండల నాయకులు పోలిరెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలోసంబరాలను చేపట్టారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టీ డీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మైదుకూరులో ఏర్పాటు చేసిన సీఎం ప్రత్యక్ష ప్రసారం



ప్రొద్దుటూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు



పోరుమామిళ్ల..చల్లగిరిగెలలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నేతలు



ఎర్రగుంట్లలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నేతలు



ముద్దనూరులో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నేతలు



బద్వేలు నాలుగురోడ్ల కూడలిలో కేక్‌కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



బి.మఠంలో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నేతలు

లోదుక్కులు ఎంతో ప్రయోజనం

ముద్దనూరు జూన్12:ఖరీఫ్ సీజన్‌లో రైతులు లోదుక్కులు చేసుకోవాలని ఏవో వెంకటకృష్ణారెడ్డి సూచించారు.ఈ సందర్భంగా రైతులకు ఏవో పలు సూచనలు చేశారు.ఖరీఫ్ సీజన్‌లో లోదుక్కులు చేయటం వల్ల పంటలకు చీడపీడలు ఆశించవని, కలుపు సమస్య ఉండదన్నారు. భూమి సారవంతమై అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు.వర్షాలు పడుతున్నందున వర్షపు నీరు భూమిలోకి ఇంకిపోయి,తేమశాతం సంవృద్ధిగా ఉంటుందన్నారు. నాగళ్లతో గాని ట్రాక్టర్ సహాయంతో వాలుకు అడ్డంగా దుక్కులు చేసుకోవాలని, దీంతో నేల కోత జరుగకుండా కాపాడుకోవచ్చని సూచించారు.

బైక్ చోరీ-పోలీసులకు ఫిర్యాదు

ఎర్రగుంట్ల, జూన్ 12: ఎర్రగుంట్ల మెయిన్‌బజార్‌లో టీఅంగడి నడుపుకుంటున్న జి.రామలింగయ్య అలియాస్ కైలాస్‌కు చెందిన బైక్ మంగళవారం రాత్రి చోరీకి గురైంది. కైలాస్ 11వ తేదీ రాత్రి టీ అంగడి మూత చేసి వినాయకనగర్‌లో తన ఇంటికెళ్లి ఎప్పటిలాగానే ఇంటిముందు హీరోహోండా స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను పార్క్ చేసి తాళాలు తన వద్దనే ఉంచుకున్నాడు. ఉదయం అంగడికి వెళ్ళేందుకు బైక్‌కోసం చూడగా అది కనిపించలేదు. ఉదయం తనవాళ్లకు అందరిని అడిగి తెలుసుకున్నాడు. అయినా ఎవరూ తీసుకెళ్లలేదని తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆర్థికసాయం అందజేత

కాశినాయన జూన్12: ఓబుళాపురం సమీపంలోని వివేకానంద సేవాఆశ్రమానికి కొమరోలుకు చెందిన యోగా సెంటరు సభ్యులు రూ.61700 ఆర్థిక సాయం అందజేశారు. ఆమేరకు బుధవారం యోగా గురువు ఉపాధ్యాయుడు బి.జయరామయ్యతో కలిసి సభ్యులు ఆశ్రమాన్ని సందర్శించి అనాథలు,వృద్ధులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తంచేసి నిర్వాహకులైన రామక్రిష్ణారెడ్డి, రామతులసి దంపతులను అంభినందించారు. అనంతరం యోగా సభ్యులను సత్కరించారు.

మంత్రులకు అభినందనలు తెలిపిన నేతలు



బి.కోడూరు, జూన్ 12 : రాష్ట్రమంత్రివర్యులుగా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన ఆనం రామనారాయణరెడ్డి, మండిపల్లె రాంప్రసాద్ రెడ్డిని మండల పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి నాయకులతో కలిసి వారికి పుష్పగుచ్చం ఇచ్చి విజయవాడలో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోడి రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీ చించివేత



ప్రొద్దుటూరు,జూన్ 12 : ఇటీవల ఎన్నికల సమయంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మీ, ఆమెభర్త మాజీ కౌన్సిలర్‌జంబాపురం రామాంజనేయులరెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద వేసిన ఫ్లెక్సీని గుర్తుతెలియని దుండగులు చించారు. బుధవారం ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు మాజీ కౌన్సిలర్ జంబాపురం రామాంజనేయ రెడ్డితెలిపారు. పక్కన వున్న వేరే ఫ్లెక్సీలను చించలేదని తమపైవారికి వున్న కక్షతోనే ఈ పనిచేసివుంటారని అనుమానం వ్యక్తం చేశారు.

యనమల రామకృష్ణుడిని కలిసిన తమ్ముళ్లు



యనమల రామకృష్ణుడిని సన్మానిస్తున్న నాయకులు

మైదుకూరు, జూన్ 12 : మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ వియ్యంకుడు అయిన మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని విజయవాడ లోని ఆయన నివాసంలో బుధవారం స్థానిక టీడీపీ నాయకులు ఆకుల క్రిష్ణయ్య, ఆర్ శ్రీనివాసులు, కటారు క్రిష్ణ, నేట్లపల్లి మల్లిఖార్జున, చెంచురామయ్య తదితరులు కలిశారు. ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు మంత్రి పదవి రాక పోవడంతో చర్చించారు.

గోహత్యను నిషేధించండి : వీహెచ్‌పీ

ఎర్రగుంట్ల, జూన్ 12: పరిరక్షించాలని బుధవారం వీహెచ్‌పీ కమలా పురం ప్రఖండ కార్యదర్శి గడిశా రామ్మోహన్‌రెడ్డి పోలీసులకు వినతిపత్రాన్ని ఇచ్చారు. కొందరు హిందువుల మనోభావాలను ఏమాత్రం పట్టించుకోకుండా గోహత్య చేస్తున్నారన్నారు. అన్ని రవాణ రహదారుల్లో సరైన తనిఖీలు నిర్వహించాలని, అలాగే రాబోయే బక్రీద్ సందర్భంగా అనధికారికంగా ఉండే గోవధశాలలను తనిఖీ చేయాలన్నారు. గోవధ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు లక్ష్మీరెడ్డి, ఉపేంద్ర, చంద్ర శేఖర్‌రెడ్డి, శివ, రవి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాపాలతోనే జగన్‌కు ప్రతిపక్ష హోదా కూడా దక్కలేదు

మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి



మైదుకూరు, జూన్ 12 : ముఖ్యమంత్రి హోదాలో జగన్ మోహన్‌రెడ్డి చేసిన పాపాలతోనే తిరుమలేషుడు కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశాడని మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి జగన్‌పై మరో సారి విరుచకపడ్డారు. బుధవారం ఉదయం ఆయన కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ళ పాలనలో రాష్ట్రం అధోగతిపాలు చేశాడని, కనీసం దంపతులుగా స్వామి వారిని దర్శించుకోక పోవడం, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహాయంతో తాడేపల్లెలో ఇంటి వద్దే తిరుమల వేంకటేశ్వర స్వామి నమూనా ఆలయాన్ని నిర్మించడం పెద్ద తప్పు చేశారన్నారు. ఆ పాపానికి తగట్టుగానే కనీసం ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ఆ దేవుడు చేశాడన్నారు. మళ్ళీ రాష్ట్రం చంద్రబాబు పాలనలో అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మహిళ పట్ల అద్దె బస్సు డ్రైవర్ అనుచిత వ్యాఖ్యలు

మైదుకూరు, జూన్ 12 : బస్సు నిలపమని చేయి ఎత్తిన మహిళ పట్ల ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ అనుచిత వ్యాఖ్యలు చేయడంతో ఆ డ్రైవర్‌తో మహిళకు క్షమాపణ చెప్పించిన సంఘటన బుధవారం మైదుకూరులో జరిగింది. ప్రొద్దుటూరు డిపోకు చెందిన అద్దె బస్సు బస్టాండ్ నుంచి కడపకు బయటకు వస్తోంది. కాగా ఓ మహిళ బస్సు ఆపేందుకు చేయి ఎత్తగా, డ్రైవర్ నిలబెట్టకుండా, ముందుకు పోయాడు. కానీ మరో వ్యక్తి అ బస్సును ఆపాడు. ఈ క్రమంలో డ్రైవర్ మహిళను ఉద్దేశించి, అసభ్యపదజాలం ఉపయోగించాడు. ఆ మాటలు విన్న యువకులు డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగారు. దీంతో డ్రైవర్‌తో మహిళకు క్షమాపణ చెప్పించారు.